శుభాకాంక్షలతో...

**కందిమళ్ళ వేణు బాబు**

**కర్నూలు**

# చట్టబద్ధ రైతుల విత్తన హక్కులు, వినియోగం

అరిబండి ప్రసాద్‌రావు

**రైతు విత్తన హక్కుల రక్షణ వేదిక**

ఇ.నెం. 1-9-312/3/జి1, అచ్యుతరెడ్డి కాంప్లెక్స్,
విద్యానగర్, హైదరాబాద్ - 500 044

# చట్టబద్ధ రైతుల విత్తన హక్కులు, వినియోగం

ముద్రణ : మార్చి 2014

ప్రచురణ : రైతు విత్తన హక్కుల రక్షణ వేదిక

రచయిత : ప్రొ. అరిబండి ప్రసాదరావు

ప్రతులకు : అరిబండి ప్రసాదరావు
కన్వీనర్
రైతు విత్తన హక్కుల రక్షణ వేదిక,
ఇ.నెం. 1-9-312/3/జి1, అచ్యుతరెడ్డి కాంప్లెక్స్,
విద్యానగర్, హైదరాబాద్ - 500 044
సెల్ : 9490098903

విరాళము : రూ. 10/-





# ఈ హక్కులు మనవే!

**"రైతుల విత్తన హక్కులు"**
**వారి ప్రయోజనాలకు సంబంధించినవేకావు. వీటిలో మనందరి ప్రయోజనాలు, సంస్కృతి ఇమిడి వున్నాయి. ఈ హక్కుల్ని రక్షించి పెంపొందించడం అంటే మన ప్రయోజనాలను, సంస్కృతిని మనమే రక్షించుకుంటూ పెంపొందించుకోవడమే. అందువల్ల, వీటి పరిరక్షణకు మనందరం నడుం బిగిద్దాం.**

బ్రిటీష్ వలస పాలనలో స్వాతంత్రోద్యమంలో భాగంగా "ఈ సముద్రపు నీరు మాది, దీనిలోని ఉప్పు మాది. ఈ ఉప్పను తయారు చేసి వాడుకునే హక్కు మాకే ఉంది. మరే ఇతర దేశస్థులకు లేదని" ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు జాతిపిత గాంధీజీ. ఇప్పటి ప్రపంచీకరణ విధానాల కాలంలో "మా దేశంలోని మొక్కలు మావే. ఈ మొక్కల విత్తనాలపై మాదే హక్కు మా రైతులు కోరుకున్న రకాన్ని స్వేచ్ఛగా ఎంచుకొని వేసే హక్కు ఉంది" అంటూ ఉద్యమించాల్సిన రోజులు వస్తున్నాయి. మన మొక్కల్లో ఒకటి లేక రెండు, మూడు ఇతర జన్యువులను పెట్టి వీటిపై మాకే హక్కు ఉందని ఎవరైనా అంటే ఎలా ఒప్పకోగలం? ప్రకృతిలో ఉన్న ఏ మొక్కలైనా తల్లి, తండ్రి మొక్కలుగా ఉపయోగించి కొత్త రకాల్ని రూపొందించుకొనే హక్కులు రైతులకూ ఉన్నాయి. వీటిని నిరాటంకంగా వినియోగించు కునేందుకు అవకాశాల్ని రైతులకు కల్పించడం మనందరి విధి. లేకపోతే, ఉప్పు సత్యాగ్రహంలాగా మరో సత్యాగ్రహాన్ని చేపట్టాల్సిన అవసరం వస్తుంది.

**రైతుల విత్తన హక్కుల రక్షణ వేదిక**

# ముందుమాట

విత్తనంలోనే పంట ఉన్నది. ఎంత మంచి విత్తనం వాడితే అంత దిగుబడి పెరగడానికి ఆస్కారం ఉంది. 1965–85 మధ్య సాగిన హరిత విప్లవంలో మన దేశ వ్యవసాయ ఉత్పత్తులు పెరగడానికి విత్తనంలో చేసిన మార్పులే కీలకపాత్ర పోషించాయి. మొదటిసారి 1968లో తైవాన్ నుండి తైచుంగ్ నేటివ్ - 1 వరి విత్తనం దిగుమతి చేసుకున్నాం. ఆ తర్వాత ఐఆర్–8 విత్తనాన్ని దిగుమతి చేసుకున్నాం. వాటిని మన విత్తనాలతో సంకరపరిచి "అధికోత్పత్తి వంగడాలను" సృష్టించాం. ఈ విత్తన వాడకంతో ఉత్పత్తి గతంపై రెండు మూడు రెట్లు పెరిగింది. విత్తనాల దిగుమతి సందర్భంగా మొదటిసారి "విత్తన చట్టం–1966" రూపొందించుకున్నాం. ఆ తరువాత హైబ్రిడ్ విత్తనాలు వచ్చాయి. విత్తన రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించి అన్ని పంటల విత్తనాలను అభివృద్ధి చేశాయి.

రాష్ట్రంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న విత్తనాలు భారతదేశ అవసరాలలో దాదాపు 60శాతం మేర తీరుస్తున్నాయి. దిగుమతి దశ నుండి విత్తన ఎగుమతి దశకు చేరుకున్నాం. 2000 సంవత్సరం నుండి బహుళజాతి సంస్థలు జన్యుమార్పిడి విత్తనాలను మన దేశంలో ప్రవేశపెట్టాయి. 1970లో భారత ప్రభుత్వం విత్తనాలపై పేటెంట్ చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టప్రకారం 20 సంవత్సరాల పాటు విత్తనోత్పత్తి సంస్థలకు అధికారాలు ఉంటాయి. కానీ, ప్రాసెస్ పేటెంట్ తప్ప, ఉత్పత్తిపై పేటెంట్ ఈ చట్టంలో లేదు.

విదేశీ సంస్థలు వచ్చాక మన దేశీయ విత్తనంపై ఆంక్షలు పెరిగాయి. పేటెంట్ హక్కులు లేకున్నా ప్రస్తుతం మనం రాయల్టీ యేటా వందల కోట్లు చెల్లిస్తున్నాం. బహుళజాతి కంపెనీలు మన విత్తనాలను నియంత్రిస్తున్నాయి. విత్తనాలపై భారత రైతుకు ఉన్న హక్కులను కాలరాస్తున్నాయి. తమకు అనుకూలంగా చట్టాలను ప్రభుత్వం





ద్వారా రూపొందించి మన రైతు హక్కులకు భంగం కల్గిస్తున్నారు. నేడు మార్కెట్‌లలో విత్తనాల సంఖ్య తగ్గింది. గతంలో 500 రకాలున్న విత్తనాల సంఖ్య నేడు 60–70 రకాలకు తగ్గాయి. బహుళజాతి పంటల మిశ్రమ వ్యవస్థ, పంట మార్పిడి పోయి ఏకజాతి పంట(మోనో్క్రాప్) మార్పిడి వచ్చి క్రిమికీటకాల దాడులతో దిగుబడులకు నష్టపోతున్నారు.

రాజ్యాంగంలో విత్తన చట్టం తేవాల్సిన బాధ్యత రాష్ట్రానికి ఉన్నప్పటికీ కేంద్రం విత్తన చట్ట ముసాయిదా తయారు చేసింది. కానీ, దీన్ని ఇంత వరకు పార్లమెంటులో ఆమోదింప చేయలేదు. నాణ్యతలేని విత్తనాల వల్ల ఏటా లక్షలాది ఎకరాల పంటల దిగుబడులకు రాష్ట్రంలో నష్టం వాటిల్లుతున్నా చట్టాలు లేకపోవడం వల్ల కంపెనీలు తప్పించుకుంటున్నాయి.

నేటి పరిస్థితుల్లో రైతులకు విత్తనాలపైగల హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. రైతుల హక్కులను తెలియపరుస్తూ డా. అరిబండి ప్రసాదరావుగారు వ్రాసిన పుస్తకం అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. డా. అరిబండి ప్రసాదరావుగారి కృషి ప్రసంశనీయం. బహుళజాతి సంస్థల దాడిని రైతులు తట్టుకొని నిలబడడానికి ఇది ఆయుధంగా ఉంటుంది. రైతులే విత్తనాలు ఉత్పత్తి చేసి ఇతర రైతులకు సహకరించే హక్కులను స్పష్టంగా తెలియపర్చారు.

ఈ పుస్తకాన్ని రైతులంతా వినియోగించుకొని హక్కులను తెలుసుకుంటారని ఆశిస్తాను.

**సారంపల్లి మల్లారెడ్డి**
ఉపాధ్యక్షులు
అఖిలభారత కిసాన్‌సభ

తేది. 10.03.2014

## మా మాట

సేద్యంలో విత్తనం, మొక్కల ఎంపిక అత్యంత కీలకమైనది. ఉత్పత్తిలో ఏ సాంకేతికాల్ని, ఉపకరణాల్ని వినియోగించాలో ఈ ఎంపికే నిర్ణయిస్తుంది. మనం ఏం తినాలో, తినకూడదో లేక వాడాలో, వాడకూడదో కూడా విత్తనమే నిర్ణయిస్తుంది. చివరకు, ఈ విత్తన ఎంపికలో ఇమిడి ఉన్న అంశాలే మన సంస్కృతిలో ప్రతిబింబిస్తాయి. అందువల్ల, ఈ ఎంపిక నిర్ణయం ఎవరిచేతిలో ఉంటే వారే వీటన్నిటిని నిర్ణయిస్తారు. ఇంత ప్రాముఖ్యతగల విత్తన ఎంపికహక్కు మోన్‌శాంటో లాంటి విదేశీ కంపెనీల చేతిలోకిపోతే, వారే మన వ్యవసాయ రంగాన్ని, సమాజాన్ని శాసిస్తారు. ఇవి మన వ్యవసాయంపై పట్టు పెంచుకుంటూ, తమకు లాభాల్ని అందించే సాంకేతికాల్నే రైతులకు అందిస్తారు తప్ప మన ప్రయోజనాలను పెంపొందించే లక్ష్యం కలిగి ఉండవు.

ఇపుడు మోన్‌శాంటో, తదితర కంపెనీల వల్ల "అంతర్గత విషోత్పత్తి" (ఎండోటర్మాన్ టెక్నాలజీ)తో బిటి జన్యువులను చొప్పించి పలు కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పంటల విత్తనాలను రూపొందించారు. ఇవి విడుదలకు సిద్దంగా ఉన్నాయి. బిటి వంగ విత్తనాలపై ఉన్న తాత్కాలిక నిలుపుదలవల్ల వీటి విడుదల నిలిచిపోయింది. ఇవన్నీ విడుదలైతే, మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా, వీటినే మనం తినాల్సి ఉంటుంది. మన ఆరోగ్యం, పర్యావరణం, సామాజిక ఆర్థిక పరిస్థితులపై వీటి దుష్ప్రలితాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే సమయంలో, మనల్ని మభ్యపెట్టి మనచేత వీటిని తినిపించడానికి ఈ సాంకేతికల్నీ "ప్రత్యేక ప్రొటీన్ సాంకేతికంగా" చెబుతూ మోన్‌శాంటో ప్రచారం చేస్తోంది. మనం రోజు ప్రొటీన్లను మాంసం, కోడిగుడ్లు, పప్పుల రూపంలో తింటుంటాం కాబట్టి అంతర్గత విషంతో కూడిన పదార్థాలు తిన్నా మన ఆరోగ్యానికి ఏమీకాదని భ్రమింపచేయడం ఈ ప్రచార





లక్ష్యం. వాస్తవమేమంటే నాగుపాము విషం కూడా ఒక రకమైన ప్రొటీనే. అంటే, అన్ని ప్రొటీన్‌లు మన ఆరోగ్యానికి క్షేమకరం కావు. ఒకేలా పనిచేయవు. కొన్ని ప్రొటీన్‌లు హాని కలిగిస్తాయి. దీనిని మరుగుపరచేందుకు పైవిధంగా ప్రచారం చేస్తున్నారు.

మరి, అంతర్గత విషాహార దుష్ప్రభావాల నుండి మనల్ని మనం ఎలా రక్షించుకోగలం? ఈ విత్తన ఎంపిక (హక్కు) రైతులకు ఉన్నంత కాలం, ప్రభుత్వం, పాలకులు, కంపెనీల ప్రయోజనాలకు గాక రైతులకు మద్దతునిస్తూ, మన, మన జాతీయ ప్రయోజనాలను కాపాడాలనే లక్ష్యంతో నిర్ణయాలను తీసుకుంటున్నంత కాలం మనం క్షేమంగా ఉంటాం. కాని, ఆర్థిక బలహీనతలవల్ల, ఇతర కారణాలవల్ల మన పాలకులు దేశ ప్రయోజనాలను, మన బాగోగులను, పర్యావరణ అవసరాలను పణంగాబెట్టి, కంపెనీల ప్రయోజనాలు పెంపొందేలా నిర్ణయాలను తీసుకుంటున్నారు.

మారిన సాంకేతిక పరిస్థితుల్లో విత్తన కంపెనీల అడ్డగోలు వ్యాపారాన్ని కట్టడి చేసి, సుస్థిర వ్యవసాయోత్పత్తిని ప్రోత్సహించేందుకు అవసరమైన కొత్త విత్తన చట్టాన్ని తెస్తానని 2002-విత్తన విధానంలో కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఇప్పుడు మోన్‌శాంటో లాంటి కంపెనీల వత్తిళ్ళకు లొంగి ఇప్పుడు వాగ్దానం చేసినవిధంగా కొత్త విత్తన చట్టం అవసరంలేదని, 1966 విత్తన చట్టం సరిపోతుందని చెపుతూ రాష్ట్ర ప్రభుత్వం 2013లో రూపొందించిన విత్తన చట్టాన్ని రాజ్యాంగాన్ని అతిక్రమించి ఆపమని కేంద్రం చెప్పింది. పైగా, తానే వాగ్దానం చేసిన విత్తన చట్టాన్నికూడా కేంద్రం తొక్కిపెట్టింది. సంయుక్త పార్లమెంటు కమిటి చేసిన ఏకగ్రీవ సూచనలను కేంద్ర వ్యవసాయశాఖ పక్కనబెట్టింది. ఇపుడున్న 1966 విత్తనచట్టం కంపెనీలపై నామామాత్రపు నిబంధనలనే కలిగిఉంది. కంపెనీలకు అనుకూలంగా ఉంది. దీని ఫలితమే, అడ్డగోలుగా పెరిగిపోయిన విత్తన ధరలు, నాసిరకం, కల్తీ విత్తనాల సరఫరాలు. నష్టపోయిన రైతుల గగ్గోలుపెట్టి ఆందోళన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఇది మరో ముఖ్యాంశం.

నాసిరకం కల్తీ విత్తనాల సరఫరాను నిరోధించే పేరుతో సాంప్రదాయంగా వస్తున్న రైతు విత్తన హక్కులపై విజిలెన్స్, వ్యవసాయ సిబ్బంది దాడి చేస్తున్నారు. ప్రతి పంటకు విత్తనాలను కంపెనీలనుండే రైతులచే బలవంతంగా కొనిపించే హైబ్రిడ్ విత్తనాల వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. విత్తనం, ఇతర ఉపకరణాల సరఫరా నియంత్రణ ద్వారా కమతాలలో రైతుసేద్యాన్ని కట్టడిచేస్తూ, సేద్యాన్ని కంపెనీలకు అప్పగిస్తుంది. అప్పుడున్న ప్రత్యేక కారణాలవల్ల, మొక్కల రకాలు, రైతు హక్కుల రక్షణ చట్టాన్ని 2001లో రూపొందించింది. కానీ, దీనిద్వారా వచ్చిన రైతుల హక్కులు విస్మరించబడుతున్నాయి. వీటిని గుర్తించి గౌరవించడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా లేదు. ఫలితంగా, విత్తనోత్పత్తి చేసుకుంటున్నరైతులు పలు రూపాల్లో విజిలెన్స్, వ్యవసాయశాఖ వారి దాడుల్ని చవిచూస్తున్నారు. స్వంత విత్తనాన్ని ఉత్పత్తి చేసి, అమ్ముకోవాలనుకునే రైతుల కృషిని తప్పుబడుతున్నారు. తర తరాలుగా కొనసాగిన స్వంత కొత్త విత్తనాల ఎంపిక, రూపకల్పన, ఉత్పత్తి, తోటి రైతులతో మార్పిడి, ఇతరులకు అమ్ముకునే హక్కులు దాడికి గురౌతున్నాయి. రైతులు వీటిని ఉపయోగించుకోగలిగినంతకాలం మన, మన దేశ ప్రయోజనాలు సురక్షితంగా ఉంటాయి. ఇవి మన సమగ్ర సుస్థిరాభివృద్ధికి దోహదపడతాయి. వీటికోసం విత్తన విషయంలో రైతులు తమకున్న హక్కుల్ని తెలుసుకోవాలి. అవి అందించగల పూర్తి అవకాశాల్ని అర్థం చేసుకొని వినియోగించుకోవాలి. దీనికి అవసరమైన వాతావరణాన్ని మనం కలిగించాలి. తదనుగుణంగా పాలకులు నిర్ణయాలు ఉండేలా వత్తిడి చేయాలి. వీటిపై చట్టబద్ధమైన అవగాహన కలిగించేందుకే ఈ బుక్‌లెట్. దీనిలోని చట్టపరమైన అంశాలన్నీ 'యూనివర్సిల్స్ లా పబ్లికేషన్ కంపెనీ వారి 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీలాస్ 2012' ప్రచురణనుండి సేకరించడమైనది. వ్యాఖ్యలు, సూచనలు రచయితవి.

**అరిబండి ప్రసాదరావు,** కన్వీనర్, రైతు విత్తన హక్కుల రక్షణ వేదిక





# రైతుల చట్టబద్ధ హక్కుల నేపథ్యం

రైతులకు విత్తన హక్కు ఒకరు ఇచ్చిందికాదు. మానవ నాగరికత ఆరంభం నుండే పండించే పంటలను, వాటికోసం కావాల్సిన విత్తనాలను రైతే ఎంచుకునే వాడు. పండిన పంట నుంచి విత్తనాల్ని సేకరించుకుని, తిరిగి పంటను వేయడానికి ఉపయోగించేవాడు. అవసరమైనప్పుడు ఇతరులతో పంచుకునేవాడు లేక మార్పిడి చేసుకునేవాడు. ఈ ప్రక్రియలో, తన సౌలభ్యంతోపాటు తోటివారి అవసరాలను కూడా దృషిలో ఉంచుకునేవాడు. తద్వారా సమాజ బాగోగుల నిర్వాహణలో భాగస్వామ్యం అయ్యాడు. దీనివల్ల రైతులతోపాటు అందరి ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరేవి.

ఈ ఎంపికలో అందరి ప్రయోజనాలు నెరవేరేలా 'అభిలషీయమైన' గుణగణాలుగల విత్తనాల్నే ప్రతిసారీ ఎంచుకునేవాడు. ఈ విధంగా పంటల అభివృద్ధికి రైతులు దోహదపడినారు. ఇది సాంప్రదాయ పద్దతిలో సేద్యం చేసే ప్రాంతాలలో ఇప్పటికీ కొనసాగుతోంది.

అభిలషీయమైన గుణగణాల ఎంపికకు మొదట ప్రకృతిలో సహజంగా దొరుకుతున్న వైవిధ్యంమీద ఆధారపడ్డాడు. కానీ, విజ్ఞానశాస్త్రం అభివృద్ధి పొందుతున్నకొద్దీ, ప్రకృతి రహస్యాలను గుర్తించి వాటి ఆధారంగా మొక్కల వైవిధ్యాన్ని పెంచి విత్తన ఎంపిక ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు కూడా దోహదపడ్డాడు.

పారిశ్రామిక విప్లవం, విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి దరిమిలా కృత్రిమ బ్రీడింగ్ పద్ధతులతో మానవులకు ఉపయోగపడే అన్ని మొక్కల/పంటల నాణ్యతను, దిగుబడిని

పెంచేందుకు తోడ్పడినాడు. ఇలా కృత్రిమంగా కొత్త రకాల్ని కనిపెట్టడంలో లేక రూపొందించడంలో మన పూర్వీకులు సొంత ప్రయోజనాలనే కాక సమిష్టి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునేవారు. తమ విజయాలను తోటివారితో పంచుకోవడం గౌరవంగా భావించేవారు. అలా గుర్తింపును కూడా పొందారు.

ప్రజల ప్రతినిధిగా ఎన్నికైన ఆధునిక ప్రభుత్వం కూడా తన ఆధ్వర్యంలోని పరిశోధనసంస్థల ద్వారా ఈ కార్యక్రమాల్ని కొనసాగించింది. ఉమ్మడి సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని శ్రేయో, సంక్షేమ రాజ్యంగా ఈ కర్తవ్యాల్ని ఏ సంకోచం లేకుండా కొనసాగించింది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత అప్పుడే స్వాతంత్ర్యం పొందిన దేశాలకు వ్యవసాయోత్పత్తుల అభివృద్ధిలో, ముఖ్యంగా ఆహారోత్పత్తిని పెంచడానికి మనలాంటి దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు తోడ్పడ్డాయి. ఆహారం వాణిజ్య వస్తువుగా మారనంతకాలం ఈ వొరవడి కొనసాగింది. ఈ వలయంలో రైతుల మొక్కలు, విత్తనాలు ఎంపికలోని హక్కులు పటిష్టపడ్డాయేతప్ప, బలహీనపడలేదు.

కానీ, ఆహారోత్పత్తుల్లో వాణిజ్య, పేటెంట్‌ల ధోరణులతో రైతుల విత్తన హక్కులు బలహీనపరచబడ్డాయి. ఈ ఉత్పత్తులు ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలోకి వచ్చిన తరువాత ఈ ధోరణి వేగంగా ముందుకు వచ్చింది. వ్యవసాయోత్పత్తుల పెంపు కార్యక్రమాల్లో తోటివారి శ్రేయస్సుకాక వాణిజ్య ప్రయోజనాలే ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో, పరిశోధనల ద్వారా రూపొందే కొత్త రకాలు, సాంకేతికాల్లో పొందిన 'పేటెంట్ హక్కులు' వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇలా వస్తున్న సాంకేతికాలు రైతుల విత్తన హక్కుల్ని పెంపొందించి, పరిరక్షించే విధంగాకాక ప్రైవేట్ వాణిజ్య శక్తులకు అదనపు ఆదాయాల్ని సమకూర్చుతూ, ఈ శక్తులకు వ్యవసాయరంగాన్ని నియంత్రించే శక్తిని అందించే విధంగా ఉంటున్నాయి. ముఖ్యంగా,





మన దేశ వ్యవసాయ విధానాలు, పరిశోధనలలో బహుళజాతి కంపెనీల ప్రభావం, ప్రమేయం, పట్టు పెరుగుతున్నకొద్దీ రైతుల సాంప్రదాయ పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక హక్కులు తిరోగమన దిశలో పడడాన్ని చూస్తున్నాయి. ఈ ధోరణిని అడ్డుకోవాల్సిన అవసరం నేడు ఉంది.

## మొక్కల రకాలు, విత్తనాలు, వ్యవసాయ ప్రక్రియలపై పేటెంట్ చట్టం ఏమి నిర్దేశిస్తుంది

రైతులు విత్తన హక్కులను పూర్తిగా వినియోగించుకోవడానికి వీటిని తెలుసుకోవడం చాలా ముఖ్యం. భారత పేటెంట్ చట్టం 1970లో సెక్షన్ 3 (హెచ్) ప్రకారం వ్యవసాయం, ఉద్యాన కృషి ఉత్పత్తులు, పద్ధతుల్లో, ప్రక్రియలపై ఏ పేటెంట్ హక్కులు ఎవరికీ గుర్తించరు. అలాగే, ఇదే సెక్షన్ 3(జె) ప్రకారం సూక్ష్మ జీవులు మినహా మొక్కల (చెట్ల) రకాలు, జంతువులు – మొత్తం మీద కాని లేక వీటిలో కొన్ని భాగాలపై కాని పేటెంట్ హక్కులను ఎవరికీ గుర్తించరు. ఇలా విత్తనం, మొక్కల రకాలు, జాతిఉత్పత్తి, పునరుత్పత్తికి సంబంధించిన అత్యవసర జీవప్రక్రియలపై ఎవరికీ పేటెంట్ హక్కులను గుర్తించరు. అందువల్ల పై అంశాల్లో ఏ కంపెనీ అయినా ఈ విత్తనాలు లేక మొక్కల రకాలపై మాకు పేటెంట్ హక్కులు ఉన్నాయని చెపితే అది చట్ట విర్ధుమే కాక మోసపూరిత ప్రచారమౌతుంది.

అలాగే, పేటెంట్ చట్టం లోని సెక్షన్ 53, సబ్‌సెక్షన్–(1) ప్రకారం ఏ సాంకేతికాంశంలోనైనా ఈ చట్టం క్రింద పేటెంట్ హక్కుల్ని అంగీకరిస్తే (ఉదా: జన్యువులను ప్రవేశపెట్టే టెక్నాలజీ – జీన్ ఇన్‌సర్షన్ టెక్నాలజీ) ఆ హక్కులు పేటెంట్‌కోసం అప్లికేషన్ సమర్పించిన రోజునుండి 20 సంవత్సరాలవరకు అమలులో ఉంటాయి. అంతర్జాతీయ దరఖాస్తుల విషయంలో ఈ తేదీని అంతర్జాతీయ పేటెంట్‌లకోసం (పేటెంట్ కో ఆపరేటివ్ ట్రీటి క్రింద) సమర్పించిన తేదీ నుండి 20 సంవత్సరాల కాలాన్ని లెక్కించాల్సి వుంటుంది. ఆ తరువాత, ఈ టెక్నాలజీ పబ్లిక్ సాంకేతికంగా మారుతుంది. అంటే ఈ సాంకేతికాన్ని ఎవరైనా వినియోగించుకోవచ్చు.

## మొక్కల రకాలు - రైతు హక్కుల రక్షణ చట్టం

వ్యవసాయరంగంలో ప్రపంచ వాణిజ్య సంస్థ నియమనిబంధనలు, పేటెంట్ హక్కుల నేపథ్యంలో మొక్కలపై 'సుయిజనరిస్' విధానానికి కట్టుబడి ఉంటున్నట్లు భారతదేశం ప్రకటించింది. అంటే, ప్రతి మొక్క దానికదే ప్రత్యేకమైనది. వ్యవసాయోత్పత్తులపై పేటెంట్‌ను అంగీకరించనని ప్రకటించింది. కొత్తగా రూపొందే రకాలపై, వాటిని రూపొందించిన (ప్లాంట్) బ్రీడర్స్‌కు గల హక్కులను గుర్తిస్తూనే, ఇంతవరకు రూపొందిన వివిధ పంటలలోని రకాలపై, ఇప్పటికే ప్రకృతిలో ఉన్న రకాల వైవిధ్యతపై రైతులకు గల హక్కుల్ని గుర్తించింది. వీటిని పరిరక్షించాల్సిన అవసరాన్నీ గుర్తించింది. ఇవేగాక ఇక ముందుకూడా కొత్త రకాల అభివృద్ధిలో రైతులకు గల ప్రాధాన్యతను, హక్కుల్ని గుర్తించాల్సిన అవసరాన్ని గమనంలో ఉంచుకొని వీరికి చట్టబద్ధమైన రక్షణను కల్పించింది. దీనికోసం, 'మొక్కల రకాలు మరియు రైతు హక్కుల రక్షణ చట్టాన్ని (యాక్ట్ నెంబర్ 53 ఆఫ్ 2001-ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ యాక్ట్, 2001)' రూపొందించింది.

ఈ చట్టాన్ని అమలుచేసేందుకు వీలుగా నియమ, నిబంధనలను సెప్టెంబర్ 2003, డిసెంబర్ 2004లలో రూపొందించింది. ఈ చట్టం ద్వారా ఏర్పడిందే "సాధికార మొక్కల రకాల రక్షణ, రైతు హక్కుల సంస్థ". కేంద్ర ప్రభుత్వం అనుమతితో రెగ్యులేషన్స్‌నుకూడా డిసెంబర్ 2006లో రూపొందించి జి.ఎస్.ఆర్. 740 (ఈ) తేది: 7-12-2006న ప్రకటించింది. అప్పటినుండి ఈ చట్టం ఆచరణలో అమలులోకి వచ్చింది. ఇతర చట్టాలలో ఏమున్నప్పటికీ, ఇప్పుడు ఈ చట్టం నియమ, నిబంధనలు, రెగ్యులేషన్స్ రైతుల విత్తన హక్కుల్ని రక్షిస్తున్నాయి, నియంత్రిస్తున్నాయి.

అయితే, ఇలా లభించిన హక్కులను సంబంధించిన నియమ, నిబంధనలు, రెగ్యులేషన్స్ నిర్ధేశించిన విధంగానే వినియోగించుకోవాలి. వీటిని అతిక్రమించిన వారు శిక్షార్హులౌతారు. అందువల్ల, ఈ చట్టం ద్వారా రైతులకు లభించిన విత్తన





హక్కుల నుండి పూర్తి ప్రయోజనాలను పొందడానికి వీటిపై కనీస అవగాహన కలిగి ఉండాలి. ఈ ప్రయత్నంలో భాగంగా రైతులకు సంబంధించిన హక్కుల భాగాలు ఇక్కడ సంక్షిప్తంగా ఇవ్వబడుతున్నాయి.

## నిర్దేశించిన నిర్వచనాలు

రైతులకు వచ్చిన హక్కుల్ని అనుభవించడానికి క్రింది నిర్వచనాలను గమనంలో ఉంచుకోవాలి.

**1. రైతు :** ఇది సెక్షన్ -2 (కె) ద్వారా నిర్వచించబడింది. దీని ప్రకారం క్రిందివారిలో ఎవరైనా రైతుగా పరిగణించబడతారు.

(i) స్వయంగా భూమిని దున్నుతూ పంటలు పండించేవారు. లేక

(ii) నేరుగా భూమిని లేదా పంట పండించడాన్ని స్వయంగా లేక ఇతరుల ద్వారా పర్యవేక్షిస్తూ పంటల్ని పండించేవారు.

(iii) ఒంటరిగా లేక ఇతరులతో కలిసి ప్రకృతి సహజంగా దొరికే 'అటవీ రకాలు (వైల్డ్ వెరైటీస్) లేక సాంప్రదాయ రకాల్ని సంరక్షించేవారు, లేక దాచేవారు, లేక వైల్డ్ / సాంప్రదాయ విత్తనాలను 'ఎంపిక' ద్వారా పెంచేవారు మరియు ఉపయుక్తమైన వాటి విలువను గుర్తించేవారు.

**2. రైతు రకం :** సెక్షన్ -2 (ఎల్) ద్వారా ఇది నిర్వచించబడింది. దీని ప్రకారం

(i) స్వంతచేలల్లో రూపొందించబడి సాంప్రదాయంగా సేద్యం చేయబడుతున్న రకం

(ii). రైతులకు సర్వసామాన్యంగా తెలిసిన రకం - ఇది సేద్యమయ్యే వైల్డ్ రకం లేక రకంగా గుర్తింపు పొందినది లేక దానికి సంబంధించినది.

**3. విత్తనం :** సెక్షన్-2 (ఎక్స్) క్రింద ఇది నిర్వచించబడింది. జీవంకలిగి, పునరుత్పత్తి అయ్యే అవకాశం గల పిండం (ఎంబ్రియో) లాంటిది. - ఇది పెరిగి అచ్చం మౌలిక తల్లి మొక్క గుణగణాలను కలిగి వుంటుంది.

**4. రకం (వెరైటీ) :** సెక్షన్ –2 (జడ్ ఎ) ద్వారా ఇది నిర్వచించబడింది. ఇది జీవశాస్త్రంలో అతి చిన్న వర్గాన్ని సూచిస్తుంది. సూక్ష్మజీవులను మినహాయించి మొక్కల సమూహం లేక బృందంలో ఇది ఏదైనా కావచ్చు. ఇది

(i) మొక్కలబృందం లేక సమూహం నుండి 'నిర్దేశించి గుర్తించగలిగిన' గుణాలుగలది.

(ii) కనిపించే ఒక కనీస 'గుణం'తో ఇతర మొక్కల సమూహం నుండి నేరుగా గుర్తించగలిగింది.

(iii) గుర్తించిన గుణగణాలతో పునరుత్పత్తి పొందగల మొక్కల సమూహం.

**5. ఎక్స్‌టాంట్ వెరైటీ (మొక్కల వ్యాప్తికి ఉపయోగపడే పదార్థం)**

భారతదేశంలో విత్తన చట్టం 1966 సెక్షన్ 5 క్రింద నోటిఫై చేసిన రకం (ఎక్స్‌టాంట్ వెరైటీ)గా గుర్తించబడిరది. జన్యుమార్పిడి రకాలు, రైతు రకాలు, మౌలికంగా 'పొందిన' రకాలు (ఎసెన్షియల్లీ డిరైవ్‌డ్ వెరైటీస్) దీనిలో భాగంగా వుంటాయి. భారతదేశంలో దొరకే రకాలను ఎక్స్‌టెంట్ రకాలు అంటారు. వీటిలో

(i) 1966 విత్తన చట్టం సెక్షన్ –5 కింద నోటిఫై చేయబడాలి. లేక

(ii) రైతు రకం లేక

(iii) చాలా మందికి బాగా పరిచయం ఉన్నది.

(i) అందరికి అందుబాటులో వుండే రకం (పబ్లిక్ డొమైన్)

**6. మౌలికంగా పొందిన రకం (ఎషెన్షియల్లీ డిరైవడ్ వెరైటీ) :**

ఇది సెక్షన్ –2 (ఐ) ద్వారా నిర్వచించబడింది.

(i) ప్రారంభ రకం నుండి పొందిన రకం. క్రింది పరిస్థితుల్లో ఒక రకాన్ని మౌలికంగా పొందిన రకంగా భావించవచ్చు.

(అ) అధికంగా ఏదో ఒక ప్రారంభరకం నుండి మౌలికంగా పొందిన రకం.

(ii) ప్రారంభ రకం నుండి స్పష్టంగా గుర్తించగలగాలి.

(iii) నేరుగా గుర్తించగలిగిన గుణగణం తప్ప మిగతా అన్ని గుణగణాలలో మౌలిక రకాన్ని పోలి వుండాలి. లేక మౌలిక రకాల కలయిక (తల్లి, తండ్రి రకాలు) నుండి ఏర్పడాలి.





## రైతుల హక్కులు

ఇవి చట్టంలోని సెక్షన్ 39 ద్వారా నిర్ధేశించబడ్డాయి. దీని ముఖ్యాంశాలు :

**(1). ఈ చట్టంలో ఏమి ఉన్నప్పటికీ...**

(i) కొత్త రకాన్ని రూపొందించిన లేక అభివృద్ధి పరిచిన ఏ రైతుకైనా ఆ రకాన్ని ఈ చట్టం క్రింద రిజిస్ట్రేషన్ చేయించుకునే హక్కు ఉంటుంది. ఇతర కొత్త రకాలను రూపొందించిన బ్రీడర్లలాగే వీరి రకాలకుకూడా రక్షణ కలుగుతుంది.

(ii) రైతు రకం రిజిస్ట్రేషన్‌కు అప్లికేషన్‌తోపాటు సెక్షన్ 18, సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (హెచ్)లో నిర్ధేశించిన విధంగా డిక్లరేషన్‌ను జతపరిచితే ఈ చట్టం క్రింద రిజిస్ట్రేషన్‌కు అర్హత కలిగి ఉంటుంది.

(iii) వివిధ రకాలు, ఆర్థిక ప్రాధాన్యతగల సంబంధించిన వైల్డ్ రకాలు జన్యు వనరులను సంరక్షించడంలో ఎంపిక ద్వారా వాటిని అభివృద్ధి చేసే రైతుకు చట్టంలో నిర్ధేశించిన విధంగా గుర్తింపు, జన్యునిధి నుండి రివార్డు (బహుమతి) పొందడానికి అర్హత కలిగి ఉంటాడు.

అయితే, ఇలా ఎంపిక చేసి, సంరక్షించిన రకం 'రిజిస్ట్రేషన్' చేయతగిన రకానికి డోనర్‌గా జన్యువులను అందించాలి.

(i) ఈ చట్టం క్రింద రక్షణ పొందిన రకాన్ని, దాని విత్తనాల్ని గతంలో మాదిరిగానే మిగుల్చుకోవడానికి, వినియోగించుకోవడానికి, తిరిగి విత్తడానికి, మార్పిడి చేసుకోవడానికి, పంచుకోవడానికి లేక తన సేద్య ఉత్పత్తిని అమ్ముకోవడానికి రైతుకు హక్కు ఉంటుంది.

అయితే, ఈ చట్టం క్రింద రక్షణ పొందిన ఆయా రకాలను బ్రాండెడ్ విత్తనంగా అమ్మడానికి హక్కు ఉండదు.

**వివరణ :** క్లాజ్ (i)కోసం బ్రాండెడ్ విత్తనం అంటే ప్యాకేజీలో లేక ఏ ఇతర కంటేయినర్‌లో ఉండి ఈ చట్టం క్రింద రక్షణ పొందిన రకం అని భావించాలి. (దీనిలో ఏది లోపించినా అది బ్రాండెడ్ రకం కాదు).

(2) ఈ చట్టం క్రింద రిజిస్ట్రేషన్ చేయబడిన ఏ విత్తనం లేక మొక్కపైన రైతుకు లేక

రైతు బృందానికి లేక సంస్థకు సంబంధించిన ఏ బృందానికైనా అమ్మినప్పుడు, వారికి ఆయా విత్తనం లేక మొక్క ఇవ్వగల దిగుబడిని, ఏ పరిస్థితుల్లో ఆ దిగుబడి వస్తుందో తప్పనిసరిగా బ్రీడర్ తెలపాలి. ఒకవేళ ఆ రకం ఇలా దిగుబడిని ఇవ్వడంలో విఫలమైతే, దీనివల్ల నష్టపోయిన రైతుకు లేక వారి బృందానికి 'పరిహారాన్ని' కోరే హక్కు ఉంటుంది. ఈ పరిహారాన్ని చట్టంలో నిర్దేశించిన విధంగానే కోరాలి. ఈ పరిహారాన్ని చట్టం ద్వారా 'నియమించిన ఆథారిటీ' వద్ద అప్లికేషన్‌ను పెట్టి క్లెయిమ్ చేయాలి. ఆ 'రకం' రూపొందించిన బ్రీడర్‌కు నోటీస్ ఇచ్చిన తరువాత చెప్పుకోవడానికి (వివరించడానికి) అవకాశం ఇచ్చిన తరువాత, ఇరు పక్షాలను విన్న తరువాత, బాధిత రైతుకు లేక వారి బృందానికి ఆథారిటీ పరిహారం ఇప్పిస్తూ ఉత్తర్వులను (ఆదేశాలను) ఇస్తుంది.

## రిజిస్ట్రేషన్‌కు అప్లికేషన్ ఫాం

ఇది సెక్షన్ 18 క్రింద నిర్దేశించబడింది. దీని సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (హెచ్) ప్రకారం రిజిస్ట్రేషన్ అప్లికేషన్‌తోబాటు ప్రతిపాదిత కొత్త రకం 'జన్యుపదార్థ వివరాలు' లేక రూపొందించిన రకం తల్లి, తండ్రి మొక్కల రకాల వివరాలను, కొత్త రకాల్ని రూపొందించిన తల్లి, తండ్రి రకాలను చట్టబద్ధంగా రూపొందించినవేనా ? అనే వివరాలతో కూడిన ఒక డిక్లరేషన్‌ను తప్పని సరిగా జత చేయాలి. ఈ వివరాలతో కూడిన అప్లికేషన్‌ను రిజిస్ట్రార్ ఆఫీసులో సమర్పించాలి.

సెక్షన్ -18, సబ్ సెక్షన్ (2) ప్రకారం రిజిస్ట్రేషన్‌కోసం సమర్పించే అప్లికేషన్‌లను రిజిస్ట్రార్ ఆఫీస్‌లోనే సమర్పించాలి.

**మొక్కలరకం రిజిస్ట్రేషన్‌కు అప్లికేషన్‌తోపాటు అందించాల్సిన సమాచారం :**

1. ఇది చట్టంలోని సెక్షన్ -40 ద్వారా నిర్దేశించబడింది. దీనికింద :

   (i) రిజిస్ట్రేషన్‌కోసం బ్రీడర్లు అప్లికేషన్‌ను రిజిస్ట్రార్‌కు సమర్పించాలి. కొత్త రకం జన్యుమూల వివరాలు, ఎవరైనా గిరిజనులు ఈ జన్యు మూలాల్ని సంరక్షిస్తూ ఉంటే వారి వివరాలనూ ఈ అప్లికేషన్‌తోబాటు అందించాలి.





   (ii) సెక్షన్(i)లో సూచించిన విధంగా ఏ బ్రీడర్ అయినా సమాచారాన్ని సమర్పించకపోతే, బ్రీడర్ ఉద్దేశపూర్వకంగా లేక తెలిసి కూడా అందించడం లేదని సంతృప్తి పడితే, రిజిస్ట్రేషన్ అప్లికేషన్‌ను రిజిస్ట్రార్ తిరస్కరించవచ్చు.

**తెలవక రైతు 'రక్షణ' హక్కులను ఉల్లంఘిస్తే...**

ఈ విషయం సెక్షన్ - 42లో నిర్దేశించబడింది.దీని ప్రకారం

(i) ఈ చట్టం క్రింద ఏర్పడిన హక్కులను ఏ రైతైనా తెలవక ఉల్లంఘించినట్లయితే, అతను హక్కును ఉల్లంఘించినట్లుగా భావించరాదు.

(ii). చట్టం ఉల్లంఘించినట్లు, సెక్షన్65 కింద పరిహారాన్ని కోరుతూ రిజిస్ట్రేషన్ గల బ్రీడర్ లేక ఆయన ఏజెంట్ కోర్టులో కేసు వేస్తే, కోరిన రిలీఫ్‌ను ఆకోర్టు ఇవ్వవచ్చు. అయితే, ఆ సమయంలో ఏ రైతు అయినా తనకు ఈ చట్టం తెలవక బ్రీడర్‌హక్కును ఉల్లంఘించనట్లు నిరూపించగలిగితే, ఏ కోర్టు అలాంటి చట్ట ఉల్లంఘన కేసును పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు.

## రైతుల రకానికి సాధికారత

**ఇది సెక్షన్ - 43 ద్వారా నిర్దేశించబడింది. దీని ప్రకారం :**

సెక్షన్ -23 లోని సబ్ సెక్షన్ 6, సెక్షన్ -28లలో ఏమి చెప్పినప్పటికీ, 'మౌలికంగా పొందిన రకం' రైతు రకం నుండి కొత్త రకాన్ని పొందితే సెక్షన్ 28, సబ్ సెక్షన్ (2) క్రింద అట్టి బ్రీడర్‌కు ఆ రకాన్ని సంరక్షించిన లేక అభివృద్ధి పరచిన రైతు లేక రైతు బృందం, లేక రైతు సమూహం అంగీకారం లేకుంటే, అట్టి రకానికి సాధికారత ఇవ్వబడదు. రిజిస్ట్రేషన్ చేయబడదు.

## రైతులు ఏ ఫీజు చెల్లించాల్సిన అవసరంలేదు

ఏ అధికారి, రిజిస్ట్రార్ లేక ట్రిబ్యునల్ లేక హైకోర్టులో రైతులకు వ్యతిరేకంగా ఈ చట్టం క్రింద ఏ వ్యవహారం (కేసు) ఉన్నా సంబందిత రైతు, రైతుల బృందం ఏ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ చట్టం క్రింద రూపొందించిన నియమ

నిబంధనలు లేక రెగ్యులేషన్స్ కింద తలెత్తిన వ్యవహారంలో కూడా రైతులు ఏ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

**వివరణ :** ఈ చట్టం కింద ఏ వ్యవహారంలోనైనా 'ఫీజు' అంటే, పరిశీలనకు లేక ఏ డాక్యుమెంట్ లేక కాపీని తీసుకోవడానికి లేక ఆర్డర్ కాపీని తీసుకోవడానికి మామూలుగా విధించే ఏ చార్జీలను రైతులు చెల్లించాల్సిన అవసరం లేదని అర్థం.

**కొన్ని పరిస్థితుల్లో తప్పని సరిగా లైసెన్స్ ఇచ్చే అధికారం :**

ఇది సెక్షన్ – 47 ద్వారా నిర్దేశించబడింది. దీని సబ్ సెక్షన్ (1) ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇచ్చిన మూడు సంవత్సరాల తర్వాత ఉత్సుకతగల ఎవరైనా రిజిస్టర్ చేసిన రకం విత్తనం లేక నాటడానికి కావాల్సిన విత్తనం లేక మొక్కలు దొరకడం లేదని లేక న్యాయబద్ధమైన ధరకు అందడం లేదని ఫిర్యాదు చేస్తూ తాను ఉత్పత్తి చేయడంకోసం తప్పని సరి లైసెన్స్‌ను ఇవ్వమని దరఖాస్తు చేసి పొందవచ్చు. నిర్దేశించిన విధంగా ఈ దరఖాస్తును సమర్పించాలి.

## అన్ని చట్టాలపై ఈ చట్టానికే ఆధిక్యత

సెక్షన్ 92 ప్రకారం ఈ చట్టంలో వున్న అన్ని అంశాలలో ఇతర అన్ని చట్టాలపై ఆధిక్యత వుంటుంది. అప్పటికే అమలులో ఉన్న చట్టాలకే కాక ఇతర చట్టాల్లోని ఏర్పాట్లు కూడా ఈ చట్టానికి లోబడే ఉంటాయి.

## నియమ నిబంధనలు - 2003

**అప్లికేషన్ పెట్టడం :**

రూల్ 3 (1) ప్రకారం ఈ చట్టంలో నియమితమైన అథారిటీ నిర్దేశిస్తే తప్ప అన్ని రిప్రజంటేషన్లను మొదటి షెడ్యూల్‌లో నిర్దేశించిన ఫారాల్లోనే సమర్పించాలి. రూలు 6 (1) ప్రకారం ప్రతి అప్లికేషన్ రాతపూర్వకంగా వుండాలి. దరఖాస్తుదారుని సంతకం, నిర్దేశించిన వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలి.

అప్లికేషన్లు హిందీ లేక ఇంగ్లీషులో టైపు చేసి లేక ప్రింట్ చేసి వుండాలి.

## రైతు హక్కుల నిబంధన

**సెక్షన్ 39 కింద నష్టపరిహారం (రూలు -66) :** ఏ రైతు, రైతు బృందం లేక రైతు సంస్థ చట్టంలోని సెక్షన్ 39, సబ్ సెక్షన్ (2) క్రింద అథారిటీ పరిశీలనకు దరఖాస్తు పెట్టుకోవచ్చు. అయితే, ఈ అప్లికేషన్ మొదటి షెడ్యూల్‌లోని ఫాం. పి.వి. – 25లోనే ఉండాలి.





**పరిహారానికి అప్లికేషన్ సమర్పించే పద్ధతి : (రూల్ – 67)**

1. పరిహార చెల్లింపుకోసం వచ్చిన అప్లికేషన్ గురించి రిజిస్టర్ చేసిన రకం బ్రీడర్‌కు అథారిటీ నోటీసును ఇస్తుంది.
2. అయితే, నోటీసు అందుకున్న రిజిస్టర్డ్ బ్రీడర్ నోటీసు అందిన మూడు నెలలలోపు మొదటి షెడ్యూల్‌లోని ఫారం (పివి – 26)లో పరిహారం చెల్లింపును వ్యతిరేకిస్తూ అప్లికేషన్‌ను ఆథారిటీకి పెట్టుకోవచ్చు.
3. పైపేరాలో సూచించిన విధంగా పరిహార వ్యతిరేక అప్లికేషన్‌ను మూడు నెలల లోపు అందకపోతే, అథారిటీ పరిహార చెల్లింపుకు వ్యతిరేకత లేదని భావించి తదుపరి నిర్ణయాన్ని తీసుకోవచ్చు.
4. రిజిస్టర్డ్ బ్రీడర్ నుండి పరిహార చెల్లింపుకు వ్యతిరేక అప్లికేషన్ వస్తే, ఇరుపక్షాలకు చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఆ తర్వాత, అవసరమని భావించిన మేర పరిహారం చెల్లింపుకు అథారిటీ ఆదేశాలను ఇవ్వవచ్చు.

**గమనిక :**

1. కొత్త రకాన్ని అభివృద్ధి పరిచిన లేక రూపొందించిన ఏ గ్రామ ప్రజలకైనా లేక స్థానిక సమూహానికి పరిహార చెల్లింపుకోసం అప్లికేషన్‌ను ఏ వ్యక్తి లేక వ్యక్తుల బృందం, ప్రభుత్వం లేక ప్రభుత్వేతర సంస్థ అప్లికేషన్ ను రూలు –68 కింద అథారిటీకి పెట్టవచ్చు. (దీని వివరాలు ఇక్కడ ఇవ్వడం లేదు)
2. జన్యునిధి నుండి 'లాభాల్లోని భాగాన్ని' క్లెయిమ్ చేయడానికి రూలు 70 కింద అప్లికేషన్ పెట్టుకోవాలి, (ఈ వివరాలనూ ఇక్కడ ఇవ్వడం లేదు).

## రెగ్యులేషన్స్ - 2006

1. కొత్తరకం, ఇప్పటికే ఉన్న రకాల రిజిస్ట్రేషన్ కోసం ఫారం–1 ద్వారా సమర్పించాలి. మౌలికంగా పొందిన రకాల గుర్తింపుకోసం అప్లికేషన్‌ను రెగ్యులేషన్ –10 కింద సమర్పించాలి, (వివరాలను ఇవ్వడంలేదు).

2. ఈ చట్టం కింద విత్తనాలను అంచనా వేయడానికి (అసెస్‌మెంట్) అనుసరించాల్సిన నాణ్యతా ప్రమాణాలు **'జర్నల్ ఆఫ్ ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ & ఫార్మర్స్ రైట్స్ అథారిటీ'** లో ప్రచురిస్తారు. స్పష్టమైన గుర్తింపు, ఒకేవిధంగా కనబడటం, స్థిరత్వం ఆధారంగా విత్తనాలను అంచనా వేస్తారు. ఇవి 1966 విత్తన చట్టంలో నిర్దేశించిన విధంగానే ఉంటాయి.
3. రిజిస్టర్ చేసిన రకాలు, దాని తల్లిదండ్రుల రకాలను రెగ్యులేషన్ 12 కింద రెగ్యులేషన్11లో నిర్దేశించిన విధంగా జాతీయ జన్యు బ్యాంకుకు సమర్పించాలి.

## మొక్కలు, విత్తనాలపై కంపెనీలకు ఉన్న అసలు హక్కులు ఏమిటి?

పేటెంట్ చట్టం 1970లోని సెక్షన్ 3 (జె) ద్వారా సూక్ష్మజీవులు మినహా మొక్కలు, జంతువులపై, మొత్తంమీద లేక వీటిలో ఏ భాగంమీదనైనా, ముఖ్యంగా విత్తనాలమీద ఏ పేటెంట్ హక్కులు ఉండవని ప్రత్యేకంగా చెప్పబడింది. అందువల్ల, జన్యుమార్పిడి సాంకేతికంతో ఉత్పత్తి అయ్యే బిటి పత్తి మొక్కలు (చెట్లు), విత్తనాలపై అచరణలో గుత్తాధిపత్యం పొందిన మహికో–మోన్‌శాంటోలకు ఎలాంటి హక్కులను స్వంతం చేసుకుందో ఒకసారి పరిశీలిస్తే, మొక్కలు, విత్తనాలపై కంపెనీలకుగల హక్కులు, వాటికున్న అవకాశాలు అర్థమౌతాయి.

పేటెంట్ చట్ట ద్వారా మోన్‌శాంటో టెక్నాలజీ ఎల్.ఎల్.సి. అనే కంపెనీ ఒకజాతి జన్యువును మరోజాతి జీవకణాల్లో చొప్పించే సాంకేతికానికి పేటెంట్‌ను (నెంబర్ 214436) పొందింది. దీని పేరు "మొక్కల్లో బాసిల్లస్ తురింజీనిసిస్ (ఒక రకమైన బాక్టీరియా) అంతర్గత విషగుణం ప్రతిబింబించే పద్ధతులు'. అంటే, ఇలా రిజిస్టర్ చేసిన పద్ధతిని ఉపయోగించి మోన్‌శాంటో అనుమతి లేకుండా మొక్కల్లో అంతర్గత విషగుణాన్ని ప్రతిబింబించరాదు. కానీ, సెక్షన్ 3 (జె) మొక్కలు, విత్తనాలపై పేటెంట్ హక్కులు ఉండవనికూడా స్పష్టంగానే నిర్దేశిస్తుంది. అందువల్ల, మోన్‌శాంటో కంపెనీకి ఈ సాంకేతికం ద్వారా ఉత్పత్తి అయిన మొక్కలు, విత్తనాలపై ఎలాంటి హక్కులు





ఏర్పడవు. అయినా, మహికో–మోన్‌శాంటో కంపెనీకి పత్తి సేద్యంపై ఎలా గుత్తాధిపత్యం ఏర్పడింది? తెలుసుకోవాలి. ఈ కంపెనీ తనకున్న ఆర్థిక, రాజకీయ, ఇతర పలుకుబడులను ఉపయోగించి దేశంలోని ప్రధాన విత్తన కంపెనీలను కొనేసి లేక వాటిని నియంత్రిస్తూ, ఈ సాంకేతికాన్ని కేవలం హైబ్రిడ్ విత్తనోత్పత్తికి పరిమితం చేస్తూ పత్తి మొక్కలు, విత్తనాలపై గుత్తాధిపత్యాన్ని పొందగలిగింది. **అంటే, హైబ్రిడ్ విత్తన సాంకేతికం ఒకవిధమైనటువంటి జీవ పేటెంట్ హక్కును కంపెనీలకు కల్పిస్తుంది.** దురదృష్టంగా, భారత పాలకులు కూడా ఈ జన్యువులను అధిక దిగుబడి పత్తి వంగడాలలో చొప్పించి బిటి రకాలను ఉత్పత్తి చేసేందుకు సరైన ఏర్పాట్లు చేయలేదు. ఈ దిశలో చేసిన అరకొర ప్రయత్నాలను కంపెనీ తన పద్ధతుల ద్వారా సఫలం కానీయలేదు (ఉదా. బికనీర్ నార్మా ఉదంతం). చైనాలో ఈ జన్యువులను అధిక దిగుబడి వంగడాలలోనే ప్రవేశపెట్టారు. వీరి దిగుబడి మన దిగుబడికన్నా దాదాపు రెట్టింపు ఉంది.

అందువల్ల కంపెనీలకు మొక్కలపై ఏమైనా హక్కులు ఏర్పడాలంటే ఇప్పుడు 'మొక్కల రకాలు, రైతు హక్కుల రక్షణ చట్టం 2001' ద్వారా రిజిస్టర్ చేయించుకోవాల్సిందే. ఇలా రిజిస్టర్ అయిన మొక్కలపై కంపెనీలకు ఆరు సంవత్సరాల వరకు హక్కులు ఏర్పడతాయి. రిజిస్టర్ రకానికి డిమాండ్ ఉంటే హక్కు కాలాన్ని మరో 6 సంవత్సరాలు పొడిగించుకోవచ్చు. గరిష్టంగా ఈ కాలం 15 సంవత్సరాలు. ఆ తరువాత ఈ రకం పబ్లిక్ రకంగా మారిపోతుంది. కానీ, విత్తన కంపెనీలలో ఎక్కువ భాగం పరిశోధన, ట్రయిల్ మార్కెటింగ్‌ల పేరుతో విత్తనోత్పత్తికి, అమ్మకానికి లైసెన్స్‌లను తీసుకొని, రైతుల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిపై విత్తనోత్పత్తిని చేయిస్తూ లాభాల్ని పొందుతున్నాయి. విత్తన రైతులకు మాత్రం వాగ్దానం చేస్తున్నట్లుగా చెల్లించడంలేదు. కానీ, రైతులు మాత్రం అధిక రేట్లకే కొంటున్నారు. వీటికి రిసర్చ్, ట్రయిల్ మార్కెటింగ్‌ల పేరు పెట్టడంవలన వీరి ఉత్పత్తి, అమ్మకాలపై ఎలాంటి నియంత్రణ ఉండడంలేదు. ఫిర్యాదులు వచ్చిన సందర్భాలలోకూడా "వీటిని రైతులు

తామే ఉత్పత్తి చేసుకుంటున్నామని చెబుతుండంతో తాము కంపెనీలపై ఏ చర్యలు తీసుకోలేకపోతున్నామని" వ్యవసాయశాఖ చెబుతుంది. కానీ, అదే రైతులు నేరుగా తమ చేలల్లో స్వయంగా అమ్ముకోవడానికి ఉత్పత్తి చేస్తుంటే మాత్రం విజిలెన్స్, వ్యవసాయశాఖ సిబ్బంది రైతులపై దాడి చేస్తూ భయపెడుతున్నారు. మొక్కల రకాలు, రైతు హక్కుల రక్షణ చట్టం క్రింద రైతులు పొందే హక్కుల్ని వీరు గుర్తించి, గౌరవించడంలేదు.

పేటెంట్ చట్టం (సెక్షన్ 53) ప్రకారం రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు పెట్టిన రోజు నుండి 20 సంవత్సరాల వరకు పేటెంట్ పొందిన కంపెనీకి టెక్నాలజీపై హక్కు ఉంటుంది. ఈ కాలాన్ని పేటెంట్‌కోసం దరఖాస్తు పెట్టిన రోజునుండి (అంతర్జాతీయ కంపెనీలకు అంతర్జాతీయ తేదీ, జాతీయ కంపెనీలకు జాతీయంగా పెట్టిన తేదీ) లెక్కిస్తారు. పైన ఉదహరించిన పేటెంట్‌కు మహికో-మోన్‌శాంటో అంతర్జాతీయంగా 4-11-1999న దరఖాస్తును పెట్టింది. అంటే, మనదేశంలో మోన్‌శాంటోకు 03/11/2019 వరకు ఈ సాంకేతికంపై పేటెంట్ హక్కులు ఉంటాయి. అంతవరకు ఈ సాంకేతికంతో విత్తనోత్పత్తి చేయడానికి ట్రైట్ వాల్యు పేరుతో కంపెనీకి రాయల్టీ చెల్లించాల్సిందే. ఆ తరువాత ఇది పబ్లిక్ సాంకేతికంగా మారిపోతుంది. ఎవరైనా దీనిని ఉపయోగించుకోవచ్చు. అయితే, ఇతర సాంకేతికాల ద్వారా బిటి రకాల్ని తయారు చేసుకోవచ్చు. దీనికి పై పేటెంట్ అడ్డురాదు. ఇలా ప్రత్నామ్నాయ పద్ధతులుకూడా ఉన్నాయి. రైతులు కూడా ఇలా ప్రత్యామ్నాయ పద్ధతులద్వారా, కావాలనుకుంటే, బిటి రకాలను రూపొందించుకోవచ్చు. ఈ సందర్భంలో రైతులకు ఉన్న అవకాశాలు ముందు పేజీల్లో గమనించగలరు.

## ప్రయోజనాలను రైతులు పొందడం ఏలా?

మొక్కల రకాలు రైతు హక్కుల రక్షణ చట్టంలోని సెక్షన్-39 (i) ప్రకారం రక్షణ పొందిన వాటిని, వాటి విత్తనాన్ని రైతులు తమ ఉత్పత్తి నుండి మిగుల్చుకునేందుకు, వినియోగించుకోవడానికి, విత్తడానికి, తిరిగి విత్తడానికి,





తోటి వారితో మార్పుచేసుకోవడానికి, ఇతరులతో పంచుకోవడానికి లేక అమ్ముకోవడానికి హక్కులు కలిగి ఉన్నారు. అయినప్పటికీ, పలు సందర్భాలలో వ్యవసాయాధికారులు లేక పోలీసులు "మీరు దొంగతనంగా/రహస్యంగా విత్తనోత్పత్తి చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇది శిక్షార్హం. వెంటనే సమాధానం చెప్పాలని" నోటీసులను ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటి నోటీసులకు సమాధానం 'దొంగతనంగా లేక రహస్యంగా తాను ఏమీ పండించడంలేదని, బహిరంగంగానే చేలో పండిస్తున్నానని' సమాధానం చెప్పాలి. అన్నింటికన్నా ముఖ్యం ఈ చట్టంలోని సెక్షన్-92 ప్రకారం ఇతర అన్ని చట్టాలలో ఏమీ ఉన్నప్పటికీ లేక చెప్పినప్పటికీ, ఈ చట్టంలోని సెక్షన్-39(i)కు వీటన్నింటిమీద ఆధిక్యత (ఓవర్ రైడింగ్ ఎఫెక్ట్) ఉందని సమాధానాన్ని చెప్పాలి. వీటిని గుర్తించకుండా ఏ అధికారైనా చర్య తీసుకుంటానని అంటే లేక బెదిరిస్తే, ఆ విషయాన్ని పై అధికారికి, ఆయన వినకపోతే జిల్లా కలెక్టర్ లేక పోలీస్ సూపరింటెండ్‌కు రాతపూర్వకంగా నోటీస్ విషయం తెలిపి బాధ్యులపై చర్యతీసుకోవాలని కోరాలి. దరఖాస్తును ఇవ్వాలి. అప్పటికీ నోటీస్ ఇచ్చిన అధికారి లేక పోలీసుల వేధింపు తగ్గకపోతే, స్థానిక రైతుసంఘం లేక ప్రజాప్రతినిధుల సహాయంతో ఆ అధికారిపై లేక పోలీస్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి. ఇప్పుడు విత్తన రైతుసంఘం వివిధ స్థాయిల్లో ఏర్పడి పనిచేస్తుంది. ఈ సంస్థను పటిష్టపరుచుకొని రక్షణ చర్యలు తీసుకోవాలి. అవసరమైతే న్యాయసహాయాన్ని (అడ్వకేట్) తీసుకోవాలి.

## రైతులు వినియోగించుకోగల ఇతర హక్కులు, అవకాశాలు

ఈ చట్టంలోని సెక్షన్-24, సబ్‌సెక్షన్-(6) ప్రకారం రిజిస్టర్ చేసిన రకం దీర్ఘకాల తీగజాతి (ద్రాక్ష లాంటిది) చెందినవి అయితే 9సంవత్సరాలు, ఇతర అన్ని రకాలకు 6 సంవత్సరాల వరకు మాత్రమే రక్షణ ఉంటుంది. అయితే, మొదటిసారి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి లేక సంస్థ రెన్యూ చేసుకుంటే ఈ రక్షణకాలం పెరుగుతుంది. చెట్లు లేక దీర్ఘకాల తీగ జాతికి గరిష్టంగా 18సంవత్సరాలు, ఇతర అన్ని రకాలకు

15 సంవత్సరాల వరకు రక్షణ ఉంటుంది. ఆ తర్వాత, ఇది పబ్లిక్ రకంగా మారిపోతుంది. అందువల్ల, రిజిస్టర్ చేసుకున్న ఉత్పత్తిదారులు, రైతులు ఈ విషయాల్ని గమనంలో ఉంచుకోవాలి. ఎవరైనా అభ్యంతరం పెడితే, వారి నుండి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కాపీని చూపించమని అడగాలి. కాపీ తీసుకొని దానిలోని రకం వివరాలను మొదట మొక్కల రకాలు, రైతు హక్కుల రక్షణ ఆథారిటి రిజిస్ట్రార్ హెడ్ ఆఫీస్‌లోగల అసలు రికార్డులతో సరిచూసుకోవాలి.

**పరిశోధకులకు, బ్రీడర్లకు, రైతులకు**

**రిజిస్టర్ రకాలను వినియోగించడంలో ఉన్న అవకాశాలు**

కొత్త రకాల్ని రూపొందించడంలో ఇప్పుడు రైతులు కూడా బ్రీడర్లు లేక పరిశోధకులకువలె హక్కులు కలిగి ఉన్నారు. (సెక్షన్-39, సబ్‌సెక్షన్(1), పేరా-(i)). **దీనివల్ల, సెక్షన్-30 ద్వారా పరిశోధకులు/బ్రీడర్లు పొందే అన్ని హక్కులను రైతులు లేక వారి బృందం లేక సమూహం వినియోగించుకోవచ్చు.** ఈ సెక్షన్ ప్రకారం రిజిస్టర్‌అయి, రక్షణ పొందిన ఏ రకాన్నైనా పరిశోధనకోసం వినియోగించుకోవచ్చు. కొత్త రకాలను రూపొందించడానికి 'ప్రారంభ' రకంగా వినియోగించుకోవచ్చు. అయితే, వాణిజ్య స్థాయిలో ఆ కొత్త రకాన్ని ఉత్పత్తి చేసేటప్పుడు రిజిస్టర్ చేసిన బ్రీడర్ లేక సంస్థ నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం ఆయనకు కొంత చెల్లించాల్సి రావచ్చు.

## రైతులు-ఏ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు

అన్నింటికన్నా ముఖ్యం, ఈ చట్టంలోని సెక్షన్-44 ప్రకారం ఈ చట్టంలోని ఏ వ్యవహారానికైనా రైతు, రైతు బృందం లేక రైతు సమూహం ఏ ఫీజులను చెల్లించాల్సిన అవసరం లేదు. ఏ కాపీనైనా పొందడానికి, ఉత్తర్వులను లేక డాక్యుమెంట్లను పొందడానికి ఈ మినహాయింపు వర్తిస్తుందని ఈ సెక్షన్‌లోనే వివరించబడింది. దీనిని రైతులు వినియోగించుకోవాలి.





## తప్పనిసరి ఉత్పత్తి లైసెన్స్ పొందే అవకాశం

ఏ కంపెనీ అయినా కొత్తరకం విత్తనాల్ని అవసరమైన మేర ఉత్పత్తి చేయకపోయినా లేక అడ్డగోలుగా అధిక రేట్లను చార్జీచేస్తున్నా అట్టి మొక్క రకాల ఉత్పత్తికోసం సెక్షన్-49 ద్వారా తప్పనిసరి లైసెన్స్‌ను పొందవచ్చు. ఈ హక్కును ఉపయోగించు కోవడానికి రైతులకు వ్యక్తిగతంగా వీలుపడకపోవచ్చు. కానీ, వారు "సుస్థిర వ్యవసాయ విత్తన ఉత్పత్తిదారుల సహకార సంఘం" లాంటి సహకార సంఘాన్ని ఏర్పరుచుకొని ఉత్పత్తి చేసుకోవచ్చు.

పై వివరణల దృష్ట్యా, విత్తనోత్పత్తి, వినియోగంలో ఇమిడిఉన్న సాంకేతికాంశాల్ని దృష్టిలో పెట్టుకొని రైతులు ఈ క్రింది చర్యలను కూడా తీసుకోవచ్చు.

## అధిక దిగుబడి వంగడాలు

1. రిజిస్టర్ అయి సేద్యంలో ఉన్న అన్ని రకాలను పండించుకోవచ్చు. పంట నుండి విత్తనాల్ని సేకరించుకొని మిగుల్చుకోవచ్చు. దీనికోసం ఏ చార్జీని చెల్లించాల్సిన అవసరం లేదు. తిరిగి విత్తనంగా వాడుకోవచ్చు. తోటి రైతులతో పంచుకోవచ్చు. మార్పిడి చేసుకోవచ్చు. అమ్ముకోవచ్చు. కానీ, ఏ బ్రాండ్ పేరుతోను దానిని అమ్ముకో కూడదు. బ్రాండెడ్ అనే పదాన్ని చట్టంలోనే సెక్షన్-39 (1) (i) కింద వివరించబడింది. దీని ప్రకారం బ్రాండెడ్ విత్తనం ఒక ప్యాకెట్ లేక ఇతర కంటైనర్‌లోనైనా పెట్టి, రకం పేరును, ఈ చట్టం కింద రక్షణ పొంది ఉత్పతి చేసిన కంపెనీ పేరు, తదితర వివరాలను కలిగిన లేబుల్ ఉండకూడదు. వీటిల్లో ఏది లేకున్నా మామూలు సంచుల్లో ఉండే విత్తనాల్ని బ్రాండెడ్ విత్తనంగా భావించరు.

2. ఏ రైతైనా తన చేలో విత్తనాన్ని తయారు చేసుకోవచ్చు. కౌలుభూమిలో కూడా పండించుకోవచ్చు. ఇలా చేసుకోవడం మొక్కల రకం, రైతుహక్కుల రక్షణ చట్టానికి అనుగుణమని గ్రహించాలి. ఎవరు అడిగినా దీన్నే చెప్పాలి.

3. కొత్త రకాల్ని రూపొందించడంలో బ్రీడర్‌లాగానే పరిశోధనకోసం ఏ రకాన్నైనా పెంచవచ్చు. వినియోగించుకోవచ్చు. బహుశా దీన్ని దృష్టిలో పెట్టుకొనే విత్తన

కంపెనీలు 'పరిశోధన, టెస్టింగ్' కోసం అంటూ విత్తనోత్పత్తి లైసన్స్‌లను పొందుతున్నారు. అయితే, రైతులు రూపొందించిన కొత్త రకం వాణిజ్య వినియోగ స్థాయికి వచ్చినప్పుడు మాత్రం ఆ రకాన్ని రిజిస్టర్ చేసిన బ్రీడర్ లేక సంస్థకు తెలిపి వారితో ఒక అవగాహనికి రావాలి. ఇది తప్పనిసరి.

4. విత్తనోత్పత్తిపై హక్కులను నిలబెట్టుకోకుండా వ్యవసాయ ఉత్పత్తిపై రైతు ఏ నియంత్రణను పొందలేడు. విత్తన కంపెనీలు దీనిని గమనంలో ఉంచుకునే, రైతుల ఉత్పత్తిని నియంత్రిస్తూ తమ గుప్పిట్లో ఉంచుకోవడానికి హైబ్రిడ్ విత్తనాల ఉత్పత్తికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది సాంకేతికంతోకూడిన మరో రకం'జీవ పేటెంట్' అని చెప్పవచ్చు. ఇపుడు ఈ హైబ్రిడ్‌లు రైతుల విత్తన హక్కుల్ని, ఇతర సేద్య హక్కుల్ని, యాజమాన్య సొంత నిర్ణయ హక్కులను హరించివేయడానికి ఉపయోగపడుతున్నాయి. అందువల్ల, హైబ్రిడ్ రకాలు అధిక దిగుబడి వంగడాలకన్నా కనీసం 30–35శాతం పంటను, ఆదాయాన్ని ఇవ్వందే సేద్యం చేయకూడదు. రైతులహక్కుల్ని పటిష్టపరిచే అధిక దిగుబడి వంగడాల సేద్యానికే ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ప్రభుత్వం రూపొందించిన మొక్కల రకాలు, రైతు హక్కుల రక్షణ చట్టంలో నిర్దేశించిన ప్రయోజనాలు రైతులకు దక్కుతాయి. ప్రభుత్వంకూడా ఈ చట్టం అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతుసంఘాలు, ఇతర ప్రజాసంస్థలు కోరాలి. అవసరమైతే దీనికోసం ఉద్యమించాలి.



చట్టబద్ద రైతుల విత్తన హక్కులు, వినియోగం